బహుమతుల ప్రదానం



కరాటే విద్యార్థులకు బహుమతులు అందజేసిన కౌన్సిలర్ సబిత

కీసర: నాగారం మున్సిపాలిటీ 7వ వార్డులోని శివసాయి గార్డెన్‌లో కరాటే విద్యార్థులకు కౌన్సిలర్ సబిత ఆంజనేయులు గౌడ్ ఆదివారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు కరాటే వంటి యుద్ధకళలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి యుద్ధకళలను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కరాటే విద్యార్థులతో పాటు వారి గురువులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు పూలమాల



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అశోక్‌గౌడ్

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుడు వూటుకూరి అశోక్‌గౌడ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచనలు ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు రామోజీ, నర్సింగ్‌రావు, మీసాల రాజేష్, సత్తిరెడ్డి, బాలానగర్ గణేష్ గౌడ్, కృష్ణంరాజు, ఆనంద్ దుర్గ, నిఖిల్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమల్లన్న యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేయిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: బాలాజీనగర్ శ్రీమల్లన్న యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వడితం అశోక్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా మల్లెపూల రామకృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శిగా తెల్లూరి కృష్ణయాదవ్, జాయింట్ కార్యదర్శిగా గొల్ల శ్యామ్‌యాదవ్, కోశాధికారిగా ఎర్రవైన రాజుయాదవ్ ఎన్నికయ్యారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ నూతన సభ్యులకు నియామకపత్రాలు అందచేసి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, గొల్లకుర్మ సహకార సంఘం అధ్యక్షులు మండల సురేందర్, శ్రీమల్లన్నయాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర



మాట్లాడుతున్న జిల్లా అధికారి నవీన్ కుమార్

కీసర: నాగారంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు నాగేష్ గౌడ్, బిజ్జ శ్రీనివాస్, పంగా హరిబాబు, కోఆప్షన్ సభ్యుడు షఫీ, మున్సిపల్ మేనేజర్ కే.చంద్రశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్‌తో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి ప్రసాద్‌ను సన్మానిస్తున్న అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి

మేడ్చల్‌రూరల్: టెర్రస్ గార్డెనింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కిసాన్ మహోత్సవంలో భాగంగా ఆదివారం టెర్రస్ గార్డెన్, ఆరోగ్య అలవాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ మిద్దె తోటలపై దృష్టి సారించాలన్నారు. వాటి ద్వారా రసాయనిక మందులు లేని కూరగాయలు,ఆ కు కూరలను పండించుకోవచ్చన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని, ఆర్థికంగా లాభాలు పొందవచ్చని, ఉదయాన్నే లేచి పని చేయడం వల్ల శరీరానికి వ్యాయామం ఉంటుందన్నారు. హైదారాబాద్ నగరంతో పాటు విజయవాడ, బెంగళూర్, వైజాగ్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే మహిళలు సైతం లాభాలు పొందుతున్నారని తెలిపారు. ప్రకృతి ప్రసాద్ ఆరోగ్యకర అలవాట్లపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు వ్యాయమానికి సమయం కేటాయించాలని, కంచు పాత్రల్లో ఆహారాన్ని వండుకోవడం మంచిదన్నారు. రసాయనాలు లేని ఉత్పత్తులు, అనారోగ్యం లేకుండా జీవించేందుకు అవసరమైన పదార్థాలను వివరించారు. అనంతరం టెర్రస్ గార్డెనింగ్ చేస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఏరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాఘవరావు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, పలు ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి రె'ఢీ'

- అసమ్మతి కార్పొరేటర్ల క్యాంప్ రాజకీయాలు
- ఎమ్మెల్యే మల్లారెడ్డిపైనే మేయర్ ఆశలు
- వెనక్కి తగ్గేది లేదంటున్న అసమ్మతి నేతలు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అసమ్మతి కార్పొరేటర్లు అర్ధరాత్రి క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. దీంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఏడాది క్రితమే జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ అవిశ్వాసం పెట్టాలని కోరుతూ 20 మంది కార్పొరేటర్లు సంతకాలతో కూడిన పత్రాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం వారందరూ క్యాంప్‌నకు తరలివెళ్లారు. అయితే గత ప్రభుత్వం పాలకవర్గ పదవీకాలాన్ని నాలుగేళ్లకు పొడిగిస్తూ మున్సిపల్ చట్టాన్ని సవరించడంతో వారు మిన్నకుండిపోయారు. ఈ నెల 27తో మున్సిపల్ పాలకమండలికి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తుండడంతో మరోసారి మేయర్ మేకల కావ్యపై అవిశ్వాసానికి తెరలేపారు. శనివారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేసిన కార్పొరేటర్లు అర్ధరాత్రి క్యాంపులకు తరలివెళ్లారు.

ఆత్మగౌరవం కోసమే..

నాలుగేళ్లుగా రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేకున్నా ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచనమేరకు మేయర్‌గా మేకల కావ్యకు మద్దతిచ్చామని అసమ్మతి కార్పొరేటర్లు అన్నారు. అయితే ఆమె అప్పటి నుంచి తన తండ్రి మేకల అయ్యప్ప ఆదేశాల మేరకు కార్పొరేటర్లను అడుగడుగునా అవమానిస్తోందన్నారు. కార్పొరేషన్‌లో మేయర్ కుటుంబ సభ్యుల పెత్తనం చెలాయిస్తున్నా ఇన్నిరోజులు భరించామని ఈ విషయాన్ని పలుమార్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. డబ్బులతోనే రాజకీయం చేయవచ్చన్న భావనలో ఉన్న అయ్యప్ప ఇంటికి వెళ్లినా సరైన గౌరవం ఇవ్వకపోగా అవమానించేలా మాట్లాడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవంలేని చోట ఉండబోమని కార్పొరేటర్లకు సరైన గౌరవం ఇస్తూ కార్పొరేషన్ అభివృద్ధికి తోడ్పడేవారికే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు.

కార్పొరేటర్లకు బంపర్ ఆఫర్..

క్యాంపు రాజకీయాలు కార్పొరేటర్లకు కాసుల పంట పండిస్తోంది. మేయర్‌పై అవిశ్వాసం కోరుతూ 20 మంది కార్పొరేటర్లు సంతకం పెట్టి క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. శిబిరానికి వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లకు కొంత మేరకు ఆఫర్ ఇచ్చి కాపాడుతున్నారు. అంతకు రెట్టింపు ఇస్తామని మేయర్ వర్గం ప్రకటించినా అసమ్మతి వర్గ నేతలు వెనక్కి తగ్గడం లేదు.

మల్లారెడ్డిపై బీఆర్‌ఎస్ అధిష్టానం ఆగ్రహం

ఓ వైపు మల్కాజిగిరి బీఆర్‌ఎస్ పార్లమెంటరీ సమావేశం జరుగుతున్న రోజే ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో బీఆర్‌ఎస్ వర్గాల్లో అలజడి మొదలైంది. అంతే కాకుండా తమ మాట పట్టించుకోకుంటే మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరతామని అసమ్మతి కార్పొరేటర్లు హెచ్చరించడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరింత తలనొప్పిగా మారింది. అవిశ్వాసం నెగ్గితే పార్టీ మరింత బలహీనపడుతుందని తెలిసినా సమస్యను పరిష్కరించడంలో విఫలమైనందున అధిష్టానం మల్లారెడ్డిపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

సొంత నిధులతో నీటి సమస్య పరిష్కారం



బోరుబావిని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా

కీసర: కీసరలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరు బావిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవగా భావించి నీటి వసతి కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య యాదవ్, అనాబోయిన జంయ్య ముదిరాజ్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుడు రాగుల రమేష్ ముదిరాజ్, మోరుగు లక్ష్మీనారాయణ, సాదిక్, ఎర్ర సాయిలు, వెంకటేశ్ గౌడ్, పుట్ట శ్రీనివాస్ గౌడ్, మెరుగు రవీందర్, శీలం శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



ఓటరు నమోదును పరిశీలిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



పూడూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్ఐ,బీఎల్ఓ

మేడ్చల్: పట్టణ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు పరిశీలించారు. పలు పోలింగ్ కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఓటరు నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫారం-6, ఫారం-8 లు అందుబాటులో ఉంచామని అవకాశాన్ని ఓటర్లు, యువత వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించామని అవసరం ఉన్న వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, చేర్పులు ,మార్పులు ఉన్న వారు సరి చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

గుండ్లపోచంపల్లిలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఓటరు దరఖాస్తు పత్రాలను స్వీకరించారు. పలువురు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. పూడూర్ గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్ఐ, బీఎల్‌వోస్ సూపర్‌వైజర్ నహీదా బేగం పరిశీలించారు.

అభినందనలు



మేడ్చల్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మల్లు రవిని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తన అనుచరులతో కలిసి వేర్వేరుగా మల్లు రవి నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు.

షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు.

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ సలహాదారుగా నియమితులైన షబ్బీర్ అలీని, ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారులుగా నియమితులైన హర్కార వేణుగోపాల్‌రావులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లు రవితో జిల్లా కాంగ్రెస్ నేతలు

ప్రతిభావంతులైన అధ్యాపకులతోనే నాణ్యమైన విద్య



అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రతిభావంతులైన అధ్యాపకులతోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ మహీపతి శ్రీనివాస్‌రావుకు ఉత్తమ అధ్యాపక అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు మోటివేషన్ తరగతులను నిర్వహిస్తున్నందుకు ఆంబిషన్స్ కెరీర్ కౌన్సిల్ సంస్థ నుంచి ఈ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యా సంస్థలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు, ప్రజ్ఞావంతులైన అధ్యాపకుల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సీఈఓ ఎస్.నీలిమ, వివిధ విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, ఆంబిషన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నడి ఊర్ల పండుగ



నడి ఊర్ల పండుగలో పాల్గొన్న చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని బొడ్రాయి వద్ద గ్రామ పెద్దలు, పనిబాట్లోల సమక్షంలో నడి ఊర్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ ఎంపీపీ బండారు దాసు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పట్నవాసులు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ రెండేళ్లకోసారి పనిబాట్లోల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వచ్చే ఆదివారం పట్నంలో గట్టు మైసమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పనిబాట్లోలు, పుర ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు సంఘటితం కావాలి



మున్నూరు కాపు కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ డా.లక్ష్మణ్

పోచారం: మున్నూరు కాపులు సంఘటితం కావాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన అన్నోజిగూడలోని శివాస్ ఫంక్షన్ హాల్‌లో మున్నూరు కాపు ఘట్‌కేసర్ మండల కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్నూరు కాపులు సంఘటిత శక్తిగా ఎదగాలన్నారు. సభ్యుల సహకారంతో సంఘం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఘట్‌కేసర్ మండల శాఖ అధ్యక్షుడు కటకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత మల్క కొమరయ్య, మున్నూరు కాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు, మేడ్చల్ జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు మామిళ్ల శ్రీనివాస్, కొర్రెముల మాజీ సర్పంచులు బైనగారి నాగరాజు, సత్తయ్య, మున్నూరు కాపు మండల ప్రతినిధులు అరుంధతి, బుర్ర రవికాంత్, మాచర్ల వినోద్, అల్వాల వెంకటేశ్, నందు, బండి సత్యనారాయణ, మాడిశెట్ట వెంకటేశ్, కుటారి సంతోష్, ఆరాల రాము తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ



మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని యూనివర్సల్ 369 అకాడమీకి చెందిన కరాటే విద్యార్థులు నగరంలోని కోట్ల విజభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన కిలాడీ నేషనల్ కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. అకాడమీకి చెందిన కృపారాణి, అమూల్య, రోజిమేరి, వినీషా, మనోజ్ఞ, మైథిలి, వరుణ్‌తేజ్, వీరభద్ర, చరణ్, గోవింద్, కృష్ణప్రియ మెడల్స్ సాధించారు. విద్యార్థులను అకాడమి సన్మానించారు. కార్యక్రమంలో పరమేష్, సాయికుమార్, అక్షయ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఆటో డ్రైవర్ల సన్మానం



మేడ్చల్: విశిష్ట సేవా పతకం సాధించిన మేడ్చల్ ఎస్ఐ నర్సింహ్మాగౌడ్‌ను మేడ్చల్‌కు చెందిన ఆటో డ్రైవర్లు సన్మానించారు. ఆదివారం పలువురు ఆటో డ్రైవర్లు మేడ్చల్ పోలీస్‌లో ఆయనను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. విధి నిర్వహణలో ప్రజలకు మరిన్ని సేవలందించి మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు విజయారావు, నర్సింగ్‌రావు, సత్యనారయణ, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌లో క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అన్ని వయస్సుల వారు పాల్గొని సత్తా చాటుకున్నారు. పరుగు పందెం, గోనె సంచి రేస్, లెమన్ అండ్ స్పూన్, స్లో సైక్లింగ్, వాకింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, పాసింగ్ ది పార్సెల్, క్రికెట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులను అందజేయనున్నట్లు సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరిప్రసాదరావు తెలిపారు.

అంతా రామమయం

- కాషాయ జెండాలతో ఆలయాల ముస్తాబు
- పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

మేడ్చల్: అయోధ్యలోని రామాలయంలో సోమవారం నిర్వహించనున్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం రామమయంగా మారింది. ప్రధాన వీధులు, పలు ఆలయాల్లో కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి. పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగులు వేయడం, తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణ, కాషాయ జెండాలు ఏర్పాటు తదితర కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పాత గ్రామ పంచాయతీ కార్యాయల సమీపంలో రాములోరి కల్యాణం నిర్వహించేందుకు వేదిక ఏర్పాటు చేశారు. రాఘవేంద్రనగర్ లో గణపతి హోమం నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు.

ప్రత్యేక పూజలు.... ఊరేగింపులు

మేడ్చల్‌రూరల్: అయోధ్యలో రామ మందిరంలో రాముడి ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పూడూర్ గ్రామంలోని మార్వాడీలు ఆదివారం ప్రత్యేక పూజలు, శోభాయాత్ర నిర్వహించారు. రామభక్త ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించిన మార్వాడీ మహిళలు కలశాలు నెత్తిన పెట్టుకుని రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబు యాదవ్, వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, శశికుమార్,శ్రీకాంత్, నాయకులు సోమేశ్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



ముస్తాబైన రామభక్త ఆంజనేయస్వామి ఆలయం

ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించాలి...

రామలాలా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలని ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ విశ్వ అన్నారు. ప్రతి ఇంటికి రాములోరి అక్షింతలు అందాయని వాటితో పూజలు చేయాలని కోరారు.

ఆలయాల ముస్తాబు

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాలు కాషాయమయంగా మారాయి. రామాలయం, ఆంజనేయ ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ప్రతి ఇంటికీ కాషాయ జెండాలను పంపిణీ చేశారు.



పూడూర్‌లో మార్వాడీల శోభాయాత్ర



మేడ్చల్ పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక